# “ఇకను నాకు కొదువ ఏమి?”

## మార్కు 10:17-27; మత్తయి 19:16-26;
## లూకా 18:18-27, పరిశీలన

మానవ శరీరాన్ని పరీక్షించగల అనేక రకాలైన వైద్యపరికరాలు నేడు వచ్చాయి: ఎక్స్‌రే యంత్రం. CAT స్కాన్, MRI వగైరాలు. “ఒక మనిషి మనస్సును ఎక్స్‌రే తీసి, ఆ మనిషి ఏమనుకుంటున్నాడో తెలిసికోగలిగితే ఎలాగుంటుందో?” ప్రభువైన యేసు ఆ పనిచేయగలరు. ఆయన హృదయాంతరంగాల్లో గుండా చూచి ఒక వ్యక్తి ఎలాటివాడై యున్నాడో నిజంగా ఎరుగగలరు. మార్కు 10:17–22లో దీనికి మనకొక ఉదాహరణ ఉంది[1]:

> ఆయన బయలుదేరి మార్గమున పోవుచుండగా ఒకడు పరుగెత్తుకొని వచ్చి ఆయన యెదుట మోకాళ్లూని – సద్బోధకుడా, నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయుదునని ఆయన నడిగెను. యేసు – నన్ను సత్పురుషుడని యేల చెప్పుచున్నావు? దేవుడొక్కడే గాని మరి ఎవడును సత్పురుషుడు కాడు. నరహత్యచేయవద్దు, వ్యభిచరింపవద్దు, దొంగిలవద్దు, అబద్ధసాక్ష్యము పలుకవద్దు, మోసపుచ్చవద్దు, నీ తలిదండ్రులను సన్మానింపుము అను ఆజ్ఞలు నీకు తెలియును గదా అని అతనితో చెప్పెను. అందుకతడు – బోధకుడా, బాల్యమునుండి ఇవన్నియు అనుసరించుచునే యుంటినని చెప్పెను. యేసు అతని చూచి అతని ప్రేమించి – నీకు ఒకటి కొదువుగానున్నది; నీవు వెళ్లి నీకు కలిగియున్నవన్నియు అమ్మి బీదలకిమ్ము, పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుమని చెప్పెను. అతడు మిగుల ఆస్తిగలవాడు, గనుక ఆ మాటకు ముఖము చిన్నబుచ్చుకొని, దుఃఖపడుచు వెళ్లి పోయెను.

### ఆ యువకుని జీవితంలో లోపించినదేమి?

కొంతమందిని వెంటనే యిష్టపడతాం, ఇతరులను అభినందించడానికి కొంత కాలం పడుతుంది. మార్కు 10లో ప్రభువునొద్దకు వచ్చిన యువకుని మనం వెంటనే యిష్ట పడతాం. అతనియందు అభినందించవలసిన మంచి లక్షణాలున్నాయి.

(1) అతడు సరియైన విధానంలో వచ్చాడు: ప్రభువును కలిసికొనడానికి అతడు పరుగెత్తాడు. తమకు ఏమి కావలెనో ఎరిగి తమ గమ్యాలను సాధించ త్వరపడేవారిని సహజంగా మనం యిష్టపడతాం. పైగా, అతడు క్రీస్తు ఎదుట మోకరించాడు. అతడు అధికారానికి గౌరవములేని కుర్రకుంక కాడు.

(2) సరియైన ఉద్దేశంతో అతడు వచ్చాడు: ఈ జీవితానికి సంబంధించిన విషయాల మీదనే అనేకులు దృష్టినిలిపే ఆ వయస్సులో, నిజముగా ముఖ్యమైన – నిత్యజీవం మీద అతడు ప్రధానమైన అక్కర కలిగినవాడై యున్నాడు.

(3) అతడు సరియైన చోటుకే వచ్చాడు: తన సాటివారు ఏమి చెప్తుతారో, జనసమూహాలు ఏమి అనుకుంటున్నారియో, లేదా మతనాయకుల అభిప్రాయమేమో వాటిమీద అతనికి ఏ శ్రద్ధా లేదు. జవాబును కనుగొనడానికి నేరుగా అతడు క్రీస్తునొద్దకే వచ్చాడు.

(4) అతడు సరియైన సమయంలో వచ్చాడు: యువకుడుగా ఉన్నప్పుడే. జ్ఞాని యిలా అన్నాడు, "దుర్దినములు రాకముందే – ఇప్పుడు వీటియందు నాకు సంతోషములేదని నీవు చెప్పు సంవత్సరములు రాక ముందే, ... నీ బాల్య దినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము" (ప్రసంగి 12:1).

ఈ మంచి లక్షణాలన్నీ ఉన్నా, తన జీవితంలో ఏదో కొదువయున్నట్టు అతడు గుర్తించాడు "–సద్బోధకుడా, నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయుదునని ఆయన నడిగెను" (మార్కు 10:17).

నీవు ఏదైన ప్రశ్న అడిగినప్పుడు, సంబంధంలేనట్టు కన్పించి జవాబును పొంది యుంటావా? ప్రభువు సమాధానం తొలిచూపులో అలాగే కన్పిస్తుంది. "యేసు – నన్ను సత్పురుషుడని యేల చెప్పుచున్నావు? దేవుడొక్కడే గాని మరి ఎవడును సత్పురుషుడు కాడు" (మార్కు 10:18).

క్రీస్తు యొక్క దైవికమైన స్వభావాన్ని అంగీకరించని కొందరు, తాను దేవుడైయున్నట్టు యేసే కాదన్నాడని రుజువు చేయడానికి దీనిని ఉపయోగిస్తుంటారు. ఇతర స్థలాల్లో, ఎలాగైనా, క్రీస్తు తన దైవత్వాన్ని స్థాపించారు. ఉదాహరణకు, యోహాను 14:9లో, "నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు" అని ఆయన తెలిపారు. వాస్తవానికి, క్రీస్తు ప్రభువు మాటలు జాగ్రత్తగా గమనించి మనం చూచినట్టయితే, ఆయన దేవత్వాన్ని కాదు అనే దానికి బదులు, అవి దానిని స్థాపిస్తాయి. యేసు మెస్సీయయైయున్నట్టు గ్రహించిన ఏ సూచనలేకుండగనే, అతడు క్రీస్తును "సద్బోధకుడా" అని పిలిచాడు. "మంచి" అనే పదాన్ని ప్రభువు పట్టుకొన్నారు. తాను మంచివాడని అతడు గుర్తించి నట్టయితే, దేవుడొక్కడే మంచివాడు గనుక, ఆయన దేవుడై యుండాలి.

ప్రభువు యొక్క ప్రతిపాదన రెండంచులు గల ఖడ్గమైయుంది. యేసు మంచివాడు కాని ఆయన దేవుడు కాదనే వారిమీద అది నేరం మోపుతుంది. తమ సొంత యోగ్యతల వలన రక్షింపబడగలమనే వారిని సయితం అది తప్పుపడుతుంది. "దేవుడొక్కడే తప్ప మంచివాడెవడూ లేడనే" సంగతిని అది స్థిరపరచుతుంది.

తన దేవత్వ భావనను పరిచయం చేసిన మీదట, క్రీస్తు అతని ప్రశ్నకు బదులిచ్చారు: "నరహత్య చేయవద్దు, వ్యభిచరింపవద్దు, దొంగిలవద్దు, అబద్ధ సాక్ష్యము పలుకవద్దు, మోసపుచ్చవద్దు, నీ తలిదండ్రులను సన్మానింపుము అను ఆజ్ఞలు నీకు తెలియును గదా." ఆ యువకుడు ఒక సాధారణమైన పొరపాటు చేశాడు; దేవుని తొలి ఆజ్ఞలకు సహాయకరంగా సంగతులెరిగిన ఒక ఉపాధ్యాయుడు అవసరమని అతడు తలంచాడు. క్రొత్తనిబంధన క్రైస్తవ్యము వారి అభిరుచులకు బహు ప్రాథమికమైనదైనట్టు అనేకులు చూస్తారు; వారికి యింకా ఎక్కువ కావాలంట. వారికి ఎక్కువే కావాలి గనుక వారు ఎక్కువనే పొందుతారు. (2 తిమోతి. 4:3, 4). అయినా, ప్రభువు మాత్రం దేవుడు

కోరినవాటిని అతనికి గుర్తు చేశారు. మత్తయి ప్రకారం, ఆయన యిలా అన్నారు: "నీవు జీవములో ప్రవేశింపగోరినయెడల ఆజ్ఞలను గైకొనుము" (మత్తయి 19:17బి).

ప్రజలకు "ఏమి - చేయని" మతం కావాలి. రోమా. 4:5 తీసికొని ("పని చేయనివానికి") ఏ పనిచేయనవసరం లేదని అది బోధిస్తున్నట్టు వారు తలంచుతారు.[2] నిత్యజీవం పొందడానికి దేవుని ఆజ్ఞలు గైకొనడం అవసరమని ప్రభువు బోధించారు. క్రీస్తు మరణానికి ముందున్న ఆ కాలంలో, ఆజ్ఞలంటే ధర్మశాస్త్రానికి సంబంధించినవే.[3] అందును బట్టి, ప్రభువు పది ఆజ్ఞలనుండి కోట్ చేశారు. ఇప్పుడైతే మనము క్రొత్త నిబంధన క్రింద జీవిస్తున్నాం. ప్రభువు ఆజ్ఞలకు నేడు మనము బద్ధులమైయున్నాం. "మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలు గైకొందురు" అని ఆయన అన్నారు (యోహాను 14:15). "మనమాయన ఆజ్ఞలు గైకొనుటయే దేవుని ప్రేమించుట" అని యోహాను రాశాడు (1 యోహాను 5:3).

ఆ ఆజ్ఞలేవి? వాటిలో కొన్నింటిని జ్ఞాపకం చేస్తాను:[4] "నేనే ఆయననని మీరు నమ్మని యెడల మీరు మీ పాపములలోనే చనిపోవుదురు." "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశించుదురు." "మనుష్యులయెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో, పరలోకమందున్న నా తండ్రియెదుట నేను వానిని ఒప్పు కొందును." "నమ్మి బాప్తిస్మముపొందిన వాడు రక్షింపబడును" (యోహాను 8:24; లూకా 13:3; మత్తయి 10:32; మార్కు 16:16). ఇంతకు ముందే శిష్యులైయున్నవారికి ప్రభువు యిలా తెలియజేశారు: "అంతము వరకు సహించినవాడు రక్షింపబడును" (మత్తయి 10:22).

గుర్తుంచుకో: నిత్యజీవం పొందనేర్చుకొనడానికి మనుష్యుల వైపు చూడకు; బైబిలువైపు చూడు. దేవుని కృపా కనికరములను అభినందించడానికి గాను మనం ఆయన తెలియజేసినదాన్ని చేయాలని క్రీస్తు ప్రభువు బోధించారు అని కూడా జ్ఞాపకముంచుకో.

ఆజ్ఞలు గైకొనుమని ప్రభువు ఆ యువకునికి తెలిపినప్పుడు, అతడు యింకా సంతృప్తి చెందలేదు. "బోధకుడా, బాల్యమునుండి ఇవన్నియు అనుసరించుచునే యుంటిని." అని ఆ యువకుడు బదులిచ్చాడు. అలా చెప్పాలని నీవు కోరుకోవా? అయితే మనలో ఎక్కువ మందిమి అలా చెప్పలేం. మొదటిగా, ఎల్లప్పుడు సరియైనదే మనం చేసినవారం కాము. రెండవదిగా, మన యవ్వనకాలం నుండి అలా చేయడానికి ప్రయత్నించినవారము కాదు. దేవుని చిత్తాన్ని చేయబూనుకొన్న యువతీ యువకులను కనుగొనడం బహు ఉల్లాసకరంగా ఉంటుంది.

ఆ సమయమందు, మత్తయి ప్రకారం, "ఇకను నాకు కొదువ ఏమి?" అని అతడు అడిగాడు (మత్తయి 19:20). తాను ఎరిగినదంతా చేశాడు, "ఇకను నాకు కొదువ ఏమని" అడిగాడు. పరిశోధించే ఆ ప్రశ్నను మనలో ప్రతి ఒక్కరు తీవ్రంగా ఆలోచించాలి.

తనకు కొదువగానున్న దాన్ని గూర్చి ఆ యువకుడు అడిగినప్పుడు, "యేసు అతని చూచి అతని ప్రేమించారు" (మార్కు 10:21). ఈ ప్రసంగ ప్రారంభంలో గుర్తించినట్టే. ప్రభువు ఒక వ్యక్తి అంతర్యాన్ని చూడగలరు. ఆ మనిషి హృదయములోనికి ఆయన పారజూచూచినప్పుడు, తాను కన్నదానిని ఆయన యిష్టపడ్డారు. ఆయన చూచిన ప్రతిదాన్ని ఆయన యిష్టపడలేదనుకో, కాని అతని యథార్థమైన అక్కరను అణగియున్న గొప్ప

శక్తిని ఆయన చూచారు. గనుక, ఆయన అతని ప్రేమించారు.

నీవు ప్రేమించిన ఒకనికి నీవేమైన చెప్పగోరావా? తాత్కాలికంగా నీ మాటలు అతని బాధిస్తాయని ఎరిగియుండియు, నీవు తన్ను ప్రేమించినందున తన మంచిగోరి ఏదైనా చెప్పియుంటావా? అదే ప్రభువైన యేసు చేసిన పని. ఆ మనిషి సమస్య ఏదో ప్రభువుకు తెలుసు – ఆయన అతని ప్రేమించినందున,[5] "నీకు ఒకటి కొదువగానున్నది; నీవు వెళ్లి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము, పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుమని చెప్పెను."

ప్రభువు మాటలను గ్రహించాలంటే, రెండు విషయాలను మనస్సులో ఉంచుకోవాలి. మొదటిది, ఈ యువకుని కొరకు ఏదో ఒక ప్రత్యేకమైన పని ప్రభువు మనస్సులో ఉన్నట్టుంది పూర్తికాలం శిష్యత్వంచేసే ప్రతివారికి యిలాగే చేయుమని ఆయన ఆజ్ఞ యిచ్చారు: "సమస్తమును విడిచిపెట్టి నన్ను వెంబడించుడి" (మత్తయి 4:18–22; లూకా 5:11, 27, 28లను చూడు).

రెండవది, ఏ శిష్యునికైనా ముందుగా అవసరమయింది ప్రభువుకు సంపూర్ణంగా సమర్పించుకొనడం. దేవుడు "రోషముగల దేవుడైయున్నాడు" (నిర్గమ. 20:5), విభాగింపబడిన ప్రేమను ఆయన అంగీకరించడు. ఈ యువకుని సందర్భంలో, క్రీస్తు శిష్యుడైయుండడం కంటె, తన సొత్తు తనకు అతిప్రాముఖ్యమయ్యిందిగా ఉంది. సంపూర్ణంగా సమర్పించుకొనడానికి అతనికి డబ్బు అడ్డుగా నిలిచింది. గనుక దాన్ని వదలుకోమని ప్రభువు అతనికి తెలియజేశారు. ఆయనకు సంపూర్ణంగా సమర్పించు కొనడంలో అడ్డంగా నిలిచిన దేనినైన మనం వదులుకోవలసియుంది. ఆది డబ్బేకావచ్చు, వ్యక్తిగతమైన సుఖమో, రహస్యమైన దోషమో, చెడ్డ స్నేహితులో, అలాటిది మరి ఏదైనా కావచ్చు. అది ఏమైన సరే, మన తలంపులలోను, యోచనలలోను ఆయన ముందుగా ఉండవలసియుంది.

దుఃఖాంతమైన కథలను వినడం నీకు యిష్టం లేకపోతే, దీని అంతాన్ని నీవు వినగోరకపోవచ్చు. ఆ యువకుని ప్రాధాన్యతలను ప్రభువు పరీక్షించగా, అందులో అతడు తప్పిపోయాడు. "అతడు మిగుల ఆస్తిగలవాడు, గనుక ఆ మాటకు ముఖము చిన్నబుచ్చుకొని, దుఃఖపడుచు వెళ్లిపోయెను."

తన గణ్యతకు, అతడు దుఃఖపడ్డాడు. అనేకులవలె క్రీస్తు ప్రభువు ఆహ్వానానికి అతడు మర్యాదలేనట్టు నిరాకరించలేదు.[6] అతడు దుఃఖపడ్డాడు ఎందుకంటే, అతడు ప్రభువును ప్రేమించాడు – తన డబ్బును కూడా ప్రేమించాడు – ఆ రెండింటి మధ్య అతడు కోరుకోవలసివచ్చింది. ఆ రెండింటిలో దేనిని వదులుకొనడానికి యిష్టం లేకపోయింది. గనుక యేసును వదులుకోవలసివచ్చినప్పుడు అతడు దుఃఖపడ్డాడు. దీన్ని గూర్చి ఆలోచించు: అతడు క్రీస్తును ప్రేమించాడు; అయితే అతడు తన డబ్బును అధికంగా ప్రేమించాడు. నీ ఆప్యాయతలు ఎక్కడ ఉంచావో భద్రం.

"దుఃఖపడుచు వెళ్లెను" – అయితే అతడు వెళ్లి పోయాడు. దాని పర్యవసానం అమర్యాదగాను, అనాగరికంగాను వెళ్లినట్టే అయ్యింది. అతడు తప్పుగా కోరుకున్నాడు – తాను కోరుకున్న నిత్యజీవానికి తన్నుతానే అపాత్రుడుగా ఎంచుకున్నాడు.

ఒక ప్రశ్న అడుగుతాను: ప్రభువు ఒకని ప్రేమించగా, అయినా ఆ వ్యక్తి నశించిపోయే అవకాశం ఉందా? క్రీస్తు ఆ మనిషిని ప్రేమించారు, ఆయినా అతడు నశించాడు. కేవలం ప్రభువు ప్రేమయే సరిపోదు (రోమా 5:8). ఆయన చిత్తానికి లోబరచుకొంటూ, ఆ ప్రేమను తిరిగి యివ్వడానికి సిద్ధపడాలి (యోహాను 14:5).

## నీ జీవితంలో లోపంగా ఉన్నదేమి?

ఆ యువకుని కథ దుఃఖపూరితంగా అంతమయ్యింది. అయితే ఈ ప్రసంగం సంతోషంగా ఎలా అంతమౌతుందో చెప్తూతాను: ఆ మనుష్యుడు అడిగిన ప్రశ్నలే అడిగి, ప్రభువు చెప్పిన దాన్ని చేయుము, "ఇకను నాకు ఏమికొదువ?" అని అడగడంతో ఆరంభించు. ఇంతకుముందు, ప్రభువు ఆజ్ఞలలో కొన్నింటిని గుర్తించుము. నీకు విశ్వాసము కొదువైయుందా? నీకు మారుమనస్సు కొదువైయుందా? ఒప్పుకోలు కొదువైయుందా? బాప్తిస్మము కొదువై యుందా? నమ్మకమైన సమర్పణతో కూడిన క్రైస్తవ జీవితము నీకు లోపమైయుంది? "నీకు ఒకటి కొదువగా ఉన్నది" అని ప్రభువు తన యొద్ద విచారించినవానికి తెలియజేశారు (మార్కు 10:21). దేవునికి లోబడుటలో ప్రధానమైన దేదైన లోపించిందా? ఒక భాగం పోయినందువలన పొలంలో నాకు ఒక పెద్ద యంత్రం పనిచేయక పడియుంది. ఓడకు ఒక చిన్న – చుక్కాని – లోపించితే పనికిమాలినదై యుంటుంది.[7]

ప్రభువు ఆదేశాల్లో దేనికి లోబడకపోయినా, ఫలితాలు భయంకరంగా ఉంటాయి. "మీరు … విశ్వసింపని యెడల మీరు మీ పాపములలోనే చనిపోవుదురు"; "మీరు మారు మనస్సు పొందనియెడల మీరందరు ఆలాగే నశింతురు"; "మనుష్యుల ఎదుట నన్ను ఎరుగనను వానిని నా తండ్రి యెదుట నేను వానిని ఎరుగనందును"; "నీటి మూలముగాను ఆత్మమూలముగాను ఒకడు జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు" (యోహాను: 8:24; లూకా 13:3; మత్తయి 10:33; యోహాను 3:5). "ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించు కొందుము?" అని క్రైస్తవులను హెబ్రీ రచయిత అడిగాడు (హెబ్రీ. 2:3). నీ జీవితంలో లోపముగా ఉన్నదేదో ప్రభువు ఎరుగును – నీవు కూడా ఎరిగియుండవచ్చు.

దీన్ని ఆలోచించు: క్రీస్తు ప్రభువు కోరిన దానిని జరిగించినందువలన, ఆ యువకుడు ఏదియు పోగొట్టుకొని యుండేవాడు కాడు. ఆ సంఘటనకు 40 సంవత్సరాలలోపుగానే రోమీయులు ఆదేశాన్ని సంపూర్ణంగా ఊడ్చివేసి, యూదులకున్న ఆస్తినంతటిని తుడిచివేసి, వారిని బానిసలుగా చేసికొన్నారు. అంతంలో, ఆ యువకుడు "పరలోకంలో ధనాన్ని" కోల్పోవడం మాత్రమే గాక తాను ఉంచుకోగోరిన దానిని సయితం అతడు పోగొట్టు కొనియుంటాడు. ప్రభువునకు నిన్ను నీవు లోబరచుకున్నట్టయితే, విలువైన దేనిని నీవు పోగొట్టుకొనవు (ఫిలిప్పీ. 3:7, 8) ఇక్కడ భూమిమీద ఆనందదాయకమైన సమృద్ధియైన జీవాన్ని, ఈ జీవితానంతరం దేవుని సముఖంలో నిత్యజీవం వేచియుంటుంది (మత్తయి 19:29).

నీ జీవితంలో ఏదేని లోపంగా ఉంటే, నేడే – ప్రభువునొద్దకు రా – ఆయనను నీ అవసరతను తీర్చనిమ్ము.

---

## సూచనలు

[1]ఈ ప్రసంగానికి మార్కు పది ప్రాథమిక వాక్యభాగమై ఉంది, కాని కొన్ని సార్లు మత్తయి 19, లూకా 18 నుండి కూడ తీసుకుంటాను. రోమా 4, 5, మరియు తదితర వాక్యభాగాలు మన రక్షణను సంపాదించుకోలేమని బోధిస్తున్నాయి; అయితే నీవు రక్షింపబడవలెనని కోరుకుంటే దేవునికి విధేయుడగుట ప్రాముఖ్యం కాదని ఆ వాక్య భాగాలు తెలుపలేదు. [2]రోమా 4:5 మరియు తదితర వచనాలు మన రక్షణను మనం సంపాదించుకోలేము అని చెప్పుతున్నాయి, అయితే, మనం రక్షింపబడాలంటే దేవునికి లోబడుట ప్రాముఖ్యం కాదని అవి చెప్పలేదు. [3]యేసు మరణమువరకు పాతనిబంధన అమలులో ఉన్నది; ఆ సమయంలోనే క్రొత్తనిబంధన అమలులోనికి వచ్చింది (కొలస్సీ. 2:14; హెబ్రీ. 9:15–17). [4]నీ శ్రోతల జీవితాలలో ఉన్న లోటును ప్రస్తావిస్తూ ఈ ప్రసంగాన్ని ఉపయోగించవచ్చు. ఇక్కడ క్రైస్తవుడగుటను గూర్చ నొక్కి చెప్పిన విశ్వాసముగల క్రైస్తవ జీవితాన్ని జీవించుటను గూర్చి ప్రసంగంలో ఉపయోగించవచ్చు. [5]హెబ్రీ. 12:6ను చూడు. [6]ప్రభువునకు విధేయత చూపించమని నీవు కోరినప్పుడు నీవు పొందిన నిర్లక్ష్యపు జవాబులను ఉదహరించు. [7]"ఒకే ఒక దానిని" పోగొట్టుకొనడం వలన కలిగిన ప్రమాదకరమైన ఫలితాన్ని నీ జీవిత అనుభవం నుండి ఉదహరించు.